

సెలవులతో విద్యార్థులు ఇంటిబాట

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కళాశాలలకు, పాఠశాలలకు గురువారం నుంచి సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఏజెన్సీలో చదువుతున్న గిరిజన విద్యార్థులు ఇళ్లకు పయనమవుతున్నారు. బుధవారం విద్యార్థులు తరగతులు ముగించుకొని ఉల్లాసంగా వెళ్లారు. తల్లిదం డ్రులు వసతి గృహాలకు చేరుకుని లగేజీతో సహా పిల్లలను తీసుకెళ్లారు. దీంతో గురువారం పాడేరు పట్టణం లో ఎటు చూసినా తమ పిల్లలను ఇళ్లకు తీసుకు వెళుతున్న సందడి నెలకొంది. తమ తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామాలకు వెళ్తుండటంతో పట్టణంలోని రోడ్లు, ఆర్‌టిసి కాంప్లెక్స్, తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి.



ఇంటికి వెళుతున్న విద్యార్థులు

అడవులను అదానీ పరం కానివ్వం

- హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేసే వరకు ఉద్యమం
- గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స
- ఏజెన్సీలో వెల్లువెత్తిన నిరసనలు



అదాని దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న అప్పలనర్స, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన ప్రాంతంలో అడవులను హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో అదానీ పరం కానివ్వమని, దీని అనుమతులు రద్దు చేసే వరకు ఉద్యమం సాగిస్తామని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స వెల్లడించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కార్పొరేట్ సంస్థ యజమాని అదానీ దిష్టిబొమ్మని గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఐటీడీఏ వద్ద దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి ఏజెన్సీలో గ్రీన్ ఎనర్జీ పేరుతో 15 వేల ఎకరాల పచ్చటి అడవిని, రిజర్వ్ ఫారెస్టును కార్పొరేట్ సంస్థ అదాని, శిరిడి సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్‌కు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. జగన్, మోడీలు తమ తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అడవిని దారా దత్తం చేస్తున్నారని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అదానీ గ్రీన్ ఎనర్జీకి సుమారు 75 వేల ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కట్టబెడుతుందని, ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామని మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. నేటికీ అధానీ కంపెనీ గత ఎనిమిదేళ్లలో రెండు లక్షల పదివేల ఎకరాల భూమిని రాష్ట్రంలో పొందినప్పటికీ పరిశ్రమలు ఎక్కడా ప్రారంభించలేదని, ఉపాధి కల్పించలేదని అదే పరిస్థితి ఆదివాసి గిరిజన ప్రాంతంలో వస్తుందన్నారు. అడవిని ధ్వంసం చేసి తమ వ్యక్తిగత అవసరాలకు వాడుకునే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రని, కార్పొరేషన్ సంస్థ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన నిర్ణయాన్ని ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఐదో షెడ్యూల్ ఏరియాలో గ్రామసభ, గిరిజన సలహా మండలి (టి. ఏ.సి) తీర్మానం లేకుండా కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తూ క్యాబినెట్ ఆమోదం చట్ట వ్యతిరేకమైం దన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏకపక్షంగా గత రెండు సంవత్సరాల నుండి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం దొంగచాటుగా టూరిస్ట్‌ల పేరుతో సర్వే నిర్వహించాయని విమర్శించారు. పర్యావరణ ప్రభావాన్ని, గిరిజన హక్కులు, చట్టాలు, ఐదో షెడ్యూల్ నిబంధనలను పరిశీలించకుండా ఏకపక్షంగా అదాని, శిరిడి సాయి కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో ఆగమేఘాలపై అనుమతులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. జాతీయ ప్రాజెక్టు పోలవరంలో నిర్వాసితులను ఆదుకోలేని ప్రభుత్వం, హైడ్రో పవర్ ప్రాజెక్టులో నిరాశ్రయులను ఆదుకుంటామని చెప్పడం మోసకారి విధానానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్.సుందర్రావు, గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొర్ర ప్రభుదాస్, చిన్నారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:హైడ్రోపవర్ ప్రాజెక్ట్ ను తక్షణమే రద్దు చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులు, గిరిజనులకు ప్రత్యేక చట్టం 1/70 ఉండగా కార్పొరేట్ శక్తులకు స్థలాలు లీజుకు ఇచ్చినా చట్టరీత్య నేరమన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల స్వలాభం, రాజకీయ లబ్ధి కోసం గిరిజన ప్రాంతాన్ని అమ్మేమాలని ప్రయత్నాలు చేడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించే వరకు పోరాడతామని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాల కు జారీ చేసిన అనుమతులు తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామదాసు, కొర్ర నరసయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో...



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

అనుమతులు రద్దు చేయాలి: జెడ్‌పిటిసి గంగరాజు

అనంతగిరి:కేంద్రం, రాష్ట్ర లు అధాని గ్రూప్ కంపెనీకి ఇచ్చిన హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతుల రద్దు చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో డముకు వరపు సంతలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, మోడి, జగన్ ఇద్దరు కలిసి గిరిజన చట్టాలను తుంగలో తొక్కి చింతపల్లి మండలం ఎర్రవరం, అనంతగిరి మండలంలో పెదకోట, టోకురు పంచాయతీ చిట్టంవలస, గూమ్మకోట పంచాయతీ గుజ్జలిలలో గిరిజన భూములు అధానికి కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ విషయమై ఎమ్మెల్యేలు చెట్టి. పాల్గుణ భాగ్యలక్ష్మి లు నోరు మెద్దప లేదని, అధాని గ్రూప్‌కి ఎంతకీ అమ్ముడు పోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టాలకు రక్షణ కల్పించవలసిన శాసనసభ్యులే నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేసే వరకు గిరిజనలతో ఉద్యమం చేస్తామని, దీనిపై జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, గిరిజన సంఘం నాయకులు గెమ్మెల దేవన్న, పూర్ణనందు, బుద్రయ్య, వెంకటరమణ, మజ్జి అప్పన్న, వార్డు మెంబరు చంద్రన్న పాల్గొన్నారు.



సామాజిక తనిఖీల్లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఉపాధి పనుల్లో రూ53.37 లక్షల అవినీతి

డ్వామా పీడీ రమేష్ రామన్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

2020-21, 2021-3022 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి మండలంలో రూ.13.57 కోట్లు ఉపాధి పనులు జరగగా అందులో రూ.56.37 లక్షలు మేరకు అవకతవకలు జరిగినట్లు డ్వామా పీడీ రమేష్ రామన్ తెలిపారు. మంగళవారం రాత్రి వరకు స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో డ్వామా పిడి ఆధ్వర్యంలో ఎంపీడీవో బాపన్న దొర అధ్యక్షతన పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులు గురించి సిబ్బంది వివరించారు. అనంతరం డ్వామా పీడీ విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులలో భాగంగా 13, 14 దఫా సోషల్ ఆడిట్‌గాను గతేడాది డిసెంబర్ 27 నుండి ఈ ఏడాది జనవరి 9 వరకు 19 పంచాయతీల పరిధిలోని గ్రామాలలో సోషల్ ఆడిట్ నిర్వహించి గ్రామసభల్లో ఉపాధి హామీ పనులపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ఉపాధి పనుల్లో జరిగిన అవినీతికి సంబంధించి ఉపాధి సిబ్బంది నుండి సుమారు రూ.72 వేలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. రూ.44లక్షల వేతనానికి గాను మొక్కలు, పనులు వారం రోజుల్లో పూర్తి చేసి సరి చేయాల్సి ఉందని చెప్పారు. రూ.9 లక్షల వరకు సిబ్బంది ఎవిడెన్స్ చూపించాల్సి ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి వడుగుల జ్యోతి, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలా దేవి, ఉపాధి హామీ ఏపీడి భాగ్యరావు, డిపిఎం పరమేష్, ఏపీఓ సురేష్ కుమార్, ఎస్ఆర్పి డి.రాజేంద్రరావు, డిఆర్పిలు చిన్న కృష్ణయ్య, ప్రసాద్, అశోక్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

పెట్టుబడులు, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -పాడేరు: ఆంధ్ర కాశ్మీర్ గా పేరుగాంచిన లంబసింగిలో తులిప్ గార్డెన్ పెంపకానికి అనుకూలమని దీనిపై దృష్టి సారించి రైతులకు తోడ్పాటు అందిస్తామని, అరకు, వంజంగి, మారేడుమిల్లి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పెట్టుబడులు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడించారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు భారీ సంఖ్యలో పడిపోతున్న లంబసింగిలో మేఘాల కొండలు చూసేందుకు గుడివాడ అమర్ నాథ్ కుటుంబ సమేతంగా బుధవారం సాయంత్రం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పాడేరు శాసనసభ్యులు కొట్టగళ్లి భాగ్యలక్ష్మితో ఉద్యానవన పంటలను పరిశీలించారు. స్ట్రాబెరీ పంటను పరిశీలించి ఎకరాకు ఎంత ఖర్చవుతుంది ఎంత ఆదాయం వస్తుందన్న వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని దీనిపై స్థానిక శాసనసభ్యులు, ఎంపీతో కలిసి ముఖ్యమంత్రి తవైయస్ జగన్మోహన్ రెడ్డి తో చర్చిస్తామని చెప్పారు. జమ్మూ కాశ్మీర్లో ఎంతో ఫేమస్ తులిప్ గార్డెన్ పెంపకానికి లంబసింగి అనుకూలమని తాజాగా వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలిందని చెప్పారు. ఆ గార్డెన్ పెంపకానికి అనుకూలంగా ఉందని శాస్త్రవేత్తల భావిస్తున్నారో ఆ చోట తులిప్ గార్డెన్ పెంపకానికి కృషి చేస్తామని చెప్పారు. మరింత అబివృద్ధి చేసి స్థానిక గిరిజన రైతులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి చూపించేలా ప్రభుత్వం సన్నాహాలు చేయనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్భ నర్సింగరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షులు మోరి రవి, జెడ్పిటిసి పోతురాజు బాలయ్య పడాల్ పాల్గొన్నారు.



ఉద్యానవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి



మట్టి ఖర్చుల డబ్బులు అందజేస్తున్న ఎంపిటిసి ప్రదీప్‌కుమార్

మృతుని కుటుంబానికి మట్టి ఖర్చులు అందజేత

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని మట్టపల్లి గ్రామంలో సున్నం రాముడు 2022 డిసెంబర్ 3న సహజ మరణం పొందగా, ప్రభుత్వం నుంచి మంజూరైన లక్ష రూపాయల బీమా సొమ్ములో ముందుగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు బుధవారం రాముడు భార్య సున్నం కిట్టమ్మకు ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, స్థానిక సర్పంచ్ వెట్టి లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాముడు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూర్రం బాబురావు, సిపిఎం నాయకులు కారం సత్తిబాబు, సచివాలయం కార్యదర్శి ఆర్ రామారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ సోడే నాగేశ్వరావు, గ్రామ వాలంటీర్ పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ప్రజా సంఘాల నేతలు

ప్రజా సంఘాల నేతలతో అధికారుల చర్చలు

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు:ఐటీడీఏ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 24వ రోజు బుధవారం కొనసాగాయి. ఎట్టకేలకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులను ఐటీడీఏలో చర్చలకు ఆహ్వానించారు. ఈ మేరకు 13 డిమాండ్లపై రెండు గంటలసేపు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులతో చర్చలు నిర్వహించారు, 13 డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులతో చర్చించిన డిమాండ్లను ఉన్నత అధికారులతో చర్చిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, కో కన్వీనర్ ప్రభుదాసు మాట్లాడుతూ, తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని అధికారులకు తెలిపినట్లు చెప్పారు. గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, మరణాలు అరికట్టేందుకు తక్షణమే హెల్త్ అసిస్టెంట్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.పాడేరు ఐటీడీఏ పిఓ ను తక్షణమే సరెండర్ చేయాలని, పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. పీవోను రక్షించడం కోసం అమాయక ఉద్యోగులను బలి చేయడం సరికాదని వారి సస్పెండ్‌ను తక్షణమే ఎత్తివేయాలన్నారు. గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు.

గిరిజనులు అప్రమత్తంగా ఉండాలి

సిఐ సుధాకర్

ప్రజాశక్తి-పాడేరుటౌన్:సంక్రాంతి పండుగ సందర్భంగా పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రజలు సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లాలని, ప్రయాణంలోనూ అప్రమత్తంగా ఉండాలని అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సిఐ బి.సుధాకర్ సూచించారు. పండుగకు చాలామంది సొంతూర్లకు ప్రయాణం అవుతారని, ఇదే అదనుగా భావించే దొంగలు చేతివటం ప్రదర్శిస్తారన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఊళ్ళకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, సామాగ్రిని కూడా తీసుకొని వెళ్లాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సమాచారం పోలీసులకు ఇవ్వాలని కోరారు. సంక్రాంతికి కోడిపందాలు, పేకాట వంటి జోలికి వెళ్ళొద్దని అన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ముమ్మరం చేశామని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ ప్రజలకు పలు సూచనలు చేశారు.



'ధాన్యం కొనుగోలు' కార్మికులకు కమీషన్ డబ్బులు చెల్లించాలి

- సిపిఎం ఆధ్వర్యాన ధర్నా
- ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి- చింతూరు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పని చేసే కార్మికులకు ఐదు సంవత్సరాలుగా చెల్లించాల్సిన కమీషన్ డబ్బులు తక్షణమే ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన చింతూరు ఐటిడిఎ ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్ మాట్లాడుతూ 2017 నుండి 2021 వరకు వెలుగు ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పని చేసిన కార్మికులకు రూ.77 లక్షలు కమీషన్ డబ్బులు చెల్లించాల్సి ఉందని తెలిపారు. కమీషన్ చెల్లించాలని ఐదేళ్లగా అడుగుతున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో అర్ధరాత్రి వరకు కార్మికులు పనిచేశారని, వారి చేత సివిల్ సప్లై, వెలుగు అధికారులు వెట్టి చాకిరీ చేయించుకున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఆఫీసుల చుట్టూ తిప్పుతూ వారిని ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు రావాల్సిన కమిషన్ డబ్బులు రూ.77 లక్షలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళన వద్దకు వచ్చిన ఐటిడిఏ పిఒ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. వెలుగు ఎపిడిని నిలదీశారు. పివో వెంటనే స్పందించి సివిల్ సప్లై ఎమ్‌డి, కమిషనర్‌తో మాట్లాడారు. ఈ సమస్య పరిష్కారం కోసం కషి చేస్తానని పిఒ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపీపీ పెంటయ్య, సర్పంచ్‌లు లక్ష్మి, నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ, సిపిఎం నాయకులు వడ్లాది రమేష్, పల్లపు పెద్ద రాములు, కార్మికులు రాములమ్మ, లక్ష్మి, ఈశ్వరమ్మ, చుక్కమ్మ, కనకదుర్గ, రాజమ్మ, కనకమ్మ, పెంటమ్మ, జయమ్మ, వెంకటమ్మ, ముత్తమ్మ పాల్గొన్నారు.



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు

అంగన్వాడీల నిర్వహణ సక్రమంగా లేకపోతే చర్యలు

ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ సక్రంగా లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ అల్లూరి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి హెచ్చరించారు. బుధవారం ఆమె రాజవొమ్మంగి 2, 4, విద్యానగర్ అంగన్వాడీ కేంద్రాలను, ఐసిడిఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కార్యాలయాల నిర్వహణ, ఫీడింగ్ తదితర వాటిని పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, ప్రీ స్కూల్‌లో అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలో1423 మినీ అంగన్వాడీ కేంద్రాలు, 1791 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, వీటిల్లో 3 నెలల నుండి 3 సంవత్సరాల లోపు చిన్నారులు 57వేల మంది, 3 నుండి 6 సంవత్సరాల ప్రీ స్కూల్ పిల్లలు 4,861 వేల మంది, గర్భిణులు 51 వేల మంది, బాలింతలు 11,058 మంది ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు 132 ఉండగా, 1628 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 218 కేంద్రాలకు ఫ్రీ రెంట్ చెల్లిస్తున్నామన్నారు. వివిధ స్కీమ్‌ల ద్వారా 436 అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు కాగా, 59 పూర్తయినట్లు వెల్లడించారు. నాడు నేడు కింద 136 మంజూరు కాగా వీటిలో 106 బేస్‌మెంట్ లెవల్‌లోనూ, మిగిలినవి వివిధ దశల్లోనూ ఉన్నాయని చెప్పారు. అనంతరం స్థానిక పిహెచ్‌సిని సందర్శించి గర్భిణులకు పౌష్టికాహారం ఎలా అందుతుందో అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఐసిడిఎస్ సీడీపీఓ పి.మణెమ్మ, సూపర్వైజర్ అరుణ ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

రెండు నెలలుగా రాని విద్యుత్ బిల్ కలెక్టర్

పెనాల్టీలు పడతాయని వినియోగదారుల ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో విద్యుత్ బిల్లులు కట్టించుకోవడానికి విద్యుత్ శాఖ బిల్ కలెక్టర్ నవంబర్ నెల నుంచి ఇప్పటి వరకు రాలేదు. దీంతో పెనాల్టీలు కట్టవలసి ఉంటుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, ఆపైన సకాలంలో బిల్ కలెక్టరు రాకపోవడంతో ఒకే సారి విద్యుత్ బిల్లులు, ఫైనాల్టీలు చెల్లించాల్సి ఉంటుందని, ఇది మోయలేని భారం అవుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్, ఫోన్‌పే ద్వారా కొంత మంది విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నా, వాటిని వాడని, వాటిపై అవగాహన లేని నిరుపేద గిరిజనుల విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకేసారి అధిక పెనాల్టీతో చెల్లించవలసిన దుస్థితి నెలకొంటుందని వారు వాపోయారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సీలేరులో విద్యుత్ బిల్లు కట్టించుకోవడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జాతీయ యువజన దినోత్సవం

ప్రజాశక్తి- చింతూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.వెంకట్రావు మాట్లాడుతూ భారతదేశం ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలకు తెలియజేసిన ఘనత స్వామి వివేకానందకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హిస్టరీ విభాగాధిపతి పి.ఏడుకొండలు, ఫిజిక్స్ విభాగాధిపతి ఎమ్.శేఖర్, అధ్యాపకులు డాక్టర్ వై.పద్మ, ఎస్.అప్పనమ్మ, జి.హారతి, కె.శకుంతల, కె.శైలజ, ఎం.నాగమొహనరావు, సిహెచ్.రాజబాబు, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, ఆర్.మౌనిక, పి.గౌతమి, జి.సాయికుమార్, వై.ఇమ్మానుయేలు, పి.అలివేలు, విద్యార్థులు పాల్గొన్నారు.



వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



సమావేశంలో మాట్లాడుతున్న పడాల్

అంగన్వాడీల సమస్యలపై 24 , 25 తేదీల్లో నిరసన

ప్రజాశక్తి-పాడేరు: అంగన్వాడీలకు ఫేషియల్ హాజరు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, తదితర 9 అంశాల పరిష్కారానికై ఈనెల 24, 25 తేదీలలో ప్రాజెక్టు ఆఫీసుల ముందు నిరసన, ఫిబ్రవరి 6న ఐసిడిఎస్ పిడి ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ వెల్లడించారు. బుధవారం చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఈ నిరసనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా స్కీం వర్కర్లకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఫేషియల్ నమోదు ప్రవేశపెట్టి ఇబ్బందులు పాలు చేస్తుందని మండిపడ్డారు. సభలు, సమావేశాలకు రద్దు చేస్తూ జీవో నెంబర్ 1 ఇవ్వడాన్ని ప్రభుత్వం నిజ స్వరూపం అర్థమైందన్నారు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు రాములమ్మ, శాంతి, సత్యవతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:అంగన్వాడి, ఆయా, మినీ కార్యకర్తల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం డిప్యూటీ తహసిల్దార్‌కు అంగన్వాడి హెల్పర్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి వెంకటలక్ష్మి, కొర్రా లక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ మాట్లాడుతూ, అంగన్వాడి ఆయా, మినీ కార్యకర్తల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు సేవలు చేస్తున్న అంగన్వాడిలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని కోరారు. అంగన్వాడి కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించి, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వాటికి అద్దెలు తక్షణమే చెల్లించాలన్నారు. టిఎ, డిఎ వెంటనే విడుదల చేయాలని, నాణ్యమైన ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటి అమలు చేసి, రిటర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ప్రభుత్వమే గ్యాస్‌ను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు జీవో 1ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు నిర్మల, సన్యాసమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నేతలు

ఏజెన్సీలో సంక్రాంతి సందడి



వారపు సంతలో సోబోరి నృత్యాలు

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:ఏజెన్సీలో సంక్రాతి పండగ సందడి ప్రారంభమైంది. ప్రాంతాల వారీగా సుమారు నెల రోజులపాటు ఈ పండుగను గిరిజనులు జరుపుకుంటారు. పండుగను పురస్కరించుకొని గిరిజన సాంప్రదాయమైన థింసా, విచిత్ర వేషధారణతో సోబోరీ నృత్యాలను ప్రదర్శిస్తుంటారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు గ్రామాలకు తరలివచ్చి గిరిజన సంప్రదాయమైన దింసా నృత్యాలు ప్రదర్శిస్తూ ఆనందంగా గడుపుతారు. మూడు రోజులపాటు గ్రామాల్లో కుటుంబ సమేతంగా నూతన వస్త్రాలను ధరించి చిన్న పెద్ద తేడా లేకుండా రాత్రుల్లో నృత్యాలు ప్రదర్శిస్తూ పండగ జరుపుకుంటారు. పిండి వంటలు చేసి పంచి పెడుతుంటారు. విచిత్ర వేషధారణతో వారపు సంతల్లో, గ్రామాల్లో సోబోరి నృత్యాలను ప్రదర్శించి ప్రతి గడపగడపకు చందా డబ్బులను వసూలు చేసి, ఆ డబ్బులతో గ్రామంలో దింసా కార్యక్రమాన్ని గిరిజనులు ఏర్పాటు చేసుకుని గ్రామస్తులంతా కలిసి థింసా ఆడతారు.

వారపు సంతలో సోబోరి సందడి:

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని కించుముండా వరపు సంతలో బుధవారం గిరిజనులు విచిత్ర వేషధారణతో డప్పు వాయిద్యాలతో సోబోరి నృత్యాలను ప్రదర్శించారు. దుకాణాలు, వాహనాల వద్ద చందాలు వసూలు చేసే సందడి చేశారు. నూతన వస్త్రాలను కొనుగోలు చేసేందుకు వారపు సంతకు గిరిజనులు రావడంతో కించమండ సంతలో సంక్రాంతి శోభ కనబడింది.



డప్పు వాయిద్యాలతో నృత్యాలు

వాణిజ్య పన్నుల శాఖలో... రూ.200 కోట్ల ఆదాయానికి గండి!



- విచారణాధికారుల అంచనా
- వ్యాపార సంస్థలతో పన్నులశాఖ కుమ్మక్కు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వాణిజ్య పన్నుల శాఖలో అవినీతి గుట్టురట్టవుతోంది. కొంతమంది అధికారుల నిర్వాకంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో దాదాపు రూ.200 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండిపడినట్లు విచారణ చేపట్టిన అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కొన్ని వ్యాపార సంస్థల నుంచి గతం కంటే ఆదాయం తక్కువ రావడంతో వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు అనుమానమొచ్చింది. ఆదాయం తగ్గడంపై ఆరా తీస్తే సర్కిల్ కార్యాలయాల నుంచి జాయింట్ కమిషనర్ కార్యాలయం వరకు కొంతమంది అధికారులు వ్యాపార సంస్థలతో కుమ్మక్కయినట్లు తేలింది. ఆదాయం తక్కువ వచ్చినప్పుడు స్పందించి, కారణాలు తెలుసుకొని సరిచేయాల్సిన ఆడిట్ విభాగం ఆ తరహా పరిశీలనచేయలేదని ఉన్నతాధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. టర్నోవర్‌పై పన్ను కట్టాల్సిరావడంతో ఆ టర్నోవర్ తక్కువచేసి చూపించడం, వే బిల్లులన్నీ ఆన్‌లైన్‌లో నమోదుచేయకుండా చేస్తున్న వ్యాపార సంస్థల తప్పుడు పద్ధతులను కొంతమంది అధికారులు చూసీచూడనట్లు పోవడంతో అంచనాకు తగినట్లు ఆదాయం రాలేదని తేలింది. ఆ రకంగా రూ.200 కోట్ల ఆదాయానికి గండిపడిందని ప్రాథమికంగా తేల్చారు. ఆదాయం తగ్గడంపై చేపట్టిన విచారణలో వ్యాపారులతో కొందరు శాఖాధికారులు కుమ్మక్కయినట్లు తెలుసుకున్నారు. వ్యాపార సంస్థలతో కుదుర్చుకున్న అవగాహన మేరకు ఈ తతంగం కొంతకాలంగా సాగుతున్నట్లు రాష్ట్ర పన్నులశాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారం బయటకురాకుండా పన్నులశాఖ కార్యాలయంలోకి ఉద్యోగులు తప్ప ఇతరుల ప్రవేశాలపై అధికారులు ఆంక్షలు విధించారు. కార్యాలయం లోపలకు వెళ్లాలంటే అధికారుల అనుమతి తప్పనిసరిచేశారు. ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల కాలంలో చేసిన వసూళ్ల ప్రగతిని చెప్పడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. రాష్ట్ర కార్యాలయంలో తప్ప ఆదాయ సమాచారం జాయింట్ కమిషనర్ కార్యాలయంలో దొరకదని సమాధానమిస్తున్నారు. సంయుక్త కమిషనర్ (రాష్ట్ర పన్నుల)-1 నాగార్జునరావును వివరణ కోరే ప్రయత్నం చేయగా, ఆడిట్ అవుతుందని తప్పించుకున్నారు. ఇదే విషయం డిప్యూటీ కమిషనర్ సిహెచ్‌సివి రవికాంత్ వద్ద ప్రస్తావిస్తే ఈ ఏడాది ఇంతవరకు ఎంత వసూళ్లయిందన్న సమాచారమంతా రాష్ట్ర కార్యాలయంలోనే ఉంటుందని, ఇక్కడ లభ్యంకాదని చెప్పారు. ఆడిట్ ఇక్కడేమీ జరగలేదని చెప్పుకొచ్చారు.



తనిఖీలు చేస్తున్న వైద్యులు

కండ్రుమ్‌లో వైద్య శిబిరం

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: మండలంలోని కండ్రుమ్ ఉప కేంద్రం వద్ద బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధిగ్రస్తులకు 104 వైద్యాధికారి సిద్ధార్థ ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. సర్పంచ్, సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు కే.హరి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు గ్రామాల్లోనే అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. దీన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.రవీంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హుకుంపేట: హుకుంపేట పంచాయతీ దాలిగుమ్మడి గ్రామానికి మధ్యలో ఉన్న చెరువు భూకబ్జాపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని హుకుంపేట ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ, గతంలో కొంతమంది హుకుంపేట పంచాయతీ దాలిగుమ్మడి గ్రామానికి మధ్యలో ఉన్న చెరువు పక్కన గల భూమిని కొనుగోలు చేశారని, ఆ భూమికి ఆనుకుని ఉన్న చెరువుకు సంబంధించిన సుమారు 30 సెంట్లు భూమిని భూ అక్రమ దారులు అమ్మి వేయడంతో ఇదే అదనుగా కొనుగోలుదారుడు ప్రహరీ నిర్మించి చెరువు సైతం ఆక్రమించు కున్నారన్నారు. గతంలో ఈ చెరువులో నీరు సమద్ధిగా ఉండేందుకు ఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధులతో లక్షలు వెచ్చించి కాల్వ పనులు చేయించారని, ఆ కాలువ పనులు సైతం పూర్తిగా ముయించి నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీని నిర్మించారని ఆమె పేర్కొన్నారు. దాలి గుమ్మడి గ్రామస్తులతో కలిసి రెండు నెలల క్రిందట తహసిల్దార్‌కి ఫిర్యాదు అందించామని ఆమె అన్నారు.

అపరిచిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దుంబ్రిగూడ:మండలంలోని అరకు సంతబయలులో గుర్తుతెలియని అపరిచిత వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గుర్తుతెలియని బయట వ్యక్తులు రాత్రి వేళల్లో ఆ గ్రామంలోనున్న సంత షెడ్లు వద్ద నిత్యం తిష్ట వేసి ఉంటున్నారని, మీరెవరిని అడిగితే అడిగిన వారిపై దురుగా ప్రవర్తించి దాడులకు పాల్పడుతున్నట్లు స్థానిక గ్రామ వర్తక సంఘం నాయకులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. దీనిపై సంబంధిత ఉన్నత అధికారులకు ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని చెప్పారు. గ్రామంలోనీ నేరేడువలస వీధిలో పాత ఇనుప సామాన్ల సేకరణ కేంద్రం ఉండడంతో, బయట ఉంచి ఉన్న పాత ఇనుప సామాన్లును గుర్తుతెలియ వ్యక్తులు దొంగిలించుకు పోతున్నారని చెప్పారు. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారని, తక్షణమే పోలీసు అధికారులు స్పందించి అపరిచిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు కె.నగేష్, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి వాసు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనింగ్ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : శిక్షణలో భాగంగా విశాఖ వచ్చిన 22 మంది ఆలిండియా సర్వీసెస్ ఐఎఎస్ ట్రైనీ అధికారులు బుధవారం విశాఖ కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌ను కలిశారు. బృంద శిక్షణలో భాగంగా జిల్లాలో నాలుగు రోజుల పాటు వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు పరిశీలన జరిపారు.

తాగునీటి సమస్యపై ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి- కూనవరం : మండలంలోని పెదర్కూర్ పంచాయితీ పరిధి, బండారు గూడెం గ్రామంలో మంచినీరు లేక కొండరెడ్లు ఇబ్బంది పడుతున్నారని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య ఆధ్వర్యంలో ఐటీడీఏ పిఓ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు బుధవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ సోలర్ ప్యానెల్ ఉన్నా అవి సరిగా పని చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అదే పంచాయితీలోని భగవాన్ పురంలోనూ తాగునీటి సమస్యలు ఉన్నాయని, రానున్న వేసవి కాలంలో ఇంకా ఇబ్బందికర పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కూటూరు పంచాయితీలోని ముళ్లూరు గ్రామాన్ని పోలవరం సర్వే చేసినప్పటికి ఏ గ్రామం నోటిఫికేషన్‌లో రాలేదని, గతంలో ఉన్న ఐటిడిఎ పిఒ ఆకుల వెంకటరమణ గ్రామాన్ని సందర్శించి గ్రామాన్ని ముంపు గ్రామంగా పరిగనించి, ప్యాకేజీ వచ్చే విధంగా చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన పిఒ సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, ఎంపీటీసీ అమ్మాజీ, పెదర్కూర్ సర్పంచ్ మడకం నాగమణి, మాజీ ఎంపీటీసీ మేకల నాగేశ్వరరావు, చదల లచ్చిరెడ్డి, సోమిరెడ్డి, సమ్మక్క, వెంకమ్మ పాల్గొన్నారు.

సుందరంగా స్పేతోడియా, కదంబ పూలు



రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదకరంగా పూసిన స్పేతోడియా, కదంబ పూలు

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం, సీలేరులో ప్రధాన రహదారికి ఇరువైపులా స్పేతోడియా, కదంబ చెట్లు పూలు వికసించడంతో ఆ మార్గం సుందరంగా ఉంది. ఈ సుందర దృశ్యాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సీలేరు అటవీ రేంజ్ పరిధి సీలేరును గ్రీన్ సిటీగా చేయడానికి 2016 -17లో నీరు-చెట్టు పథకంలో భాగంగా నాటి రేంజ్ అధికారి బెర్నాడ రాజు సీలేరు పరిసరాల్లోనూ, ప్రధాన రహదారి ఇరువైపులా మొక్కలు నాటించారు. ఏపీ జెన్కో చెక్‌పోస్ట్ నుంచి ప్రధాన రహదారి గుండా స్థానిక పిహెచ్‌సి ముందు నుంచి పోస్టాఫీస్ వరకు, జెన్కో కాలనీలో, 8వ క్లాస్ రోడ్డు సమీపంలో ఉన్న మెయిన్ రోడ్డుకు ఇరువైపులా, స్థానిక కాన్వెంట్ వరకు పలు రకాల చెట్లు నాటారు. అవి పెరిగి పెద్దవి కావడంతో ప్రస్తుతం సీలేరు గ్రీన్ సిటీగా అవతరించింది. స్థానికులతో పాటు మైదాన ప్రాంతం నుంచి వచ్చిన పర్యాటకులు గ్రీన్ సిటీ అందాలను చూసి ఎంతో అనుభూతి పొందుతున్నారు. స్థానిక పిహెచ్‌సి నుంచి యూనియన్ బ్యాంక్ వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న కదంబ, స్పేతోడియా చెట్లు ఏపుగా పెరగడమే కాకుండా చెట్లు నిండా ఎర్రని వర్ణంలో పూలు విరబూయడంతో పర్యాటకులతో పాటు ప్రధాన రహదారి గుండా బస్సుల్లో ప్రయాణిస్తున్న వారిని అలరిస్తున్నాయి.

ఆకట్టుకుంటున్న రోబోటిక్స్ సాయిబాబా

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి, నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రముఖ ఫైన్‌ఆర్ట్స్ ఆర్టిస్ట్ రవిచంద్ర రూపొందించిన రోబోటిక్స్ సాయిబాబా విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అచ్చంగా సాయిబాబాయే మాట్లాడుతున్నారా అన్నట్లు విగ్రహం నోటి వెంట ప్రవచనాలు చెప్పడం చూసి భక్తులు మధురానుభూతికి లోనయ్యారు.. ఈ విగ్రహాన్ని బుధవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శ్రీనివాసరావు దంపతులు ప్రారంభించారు. భక్తుల సందర్శనార్థం కొద్ది రోజులు ఇక్కడ ఉంచామని, అనంతరం వేరే ఆలయానికి తరలించనున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు.

విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు



విఆర్.పురం అబ్దుల్ కలాం స్కూల్‌లో సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు



చింతూరు డిగ్రీ కాలేజీలో భోగీ మంటల సందడి

ప్రజాశక్తి-విఆర్.పురం : స్థానిక అబ్దుల్ కలాం స్కూల్‌లో బుధవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కూలు ప్రాంగణంలో రంగవల్లులు, పాల పొంగళ్ళు, భోగి మంటలు, భోగిపళ్ళు, గొబ్బెమ్మలతో వేడుకలు కోలాహలంగా జరిగాయి. విద్యార్థులు ఆటపాటలు, భోగిమంటల వద్ద నృత్యాలు చేశారు. ఈ సంక్రాంతి ఉత్సవాలలో స్కూల్ కరస్పాండెంట్ ఎండి సాదత్, ప్రిన్సిపాల్ ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయులు ఎ.రమ్య, ఎం.లహరి, కె.రమ్య, భవాని, విద్యార్థుల తలదండ్రులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాలను రంగురంగుల రంగవల్లులతో అలంకరించారు. భోగి మంటలు వెలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగవల్లి, హెయిర్ స్టైల్, సంప్రదాయ వస్త్రా ధారణ, మెహందీ, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, వన్ మినిట్ గేమ్, పాటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకట్రావు, అధ్యాపకులు వై.పద్మ, ఎం.శేఖర్, ఎస్. అప్పనమ్మ, జి.హారతి, కె. శకుంతల, కె.శైలజ, ఎం.నాగమోహనరావు, సిహెచ్.రాజబాబు, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, నునే రమేష్, ఆర్.మౌనిక, పి.ఏడుకొండలు, పి.గౌతమి, జి.సాయికుమార్, వై.ఇమ్మానుయేలు, పి.అలివేలు విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ఇదేం ఖర్మ మన రాష్టానికి నిరసనలో టిడిపి నేతలు

ప్రజాశక్తి-విఆర్.పురం : వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వడ్డి గూడెం పంచాయితీ పరిధి ధర్మతల గూడెం గ్రామంలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి నాయకులు చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు గుంతలు పడి ప్రజలు నరకం అనుభవిస్తున్నారన్నారు. కరెంట్ బిల్లులు, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు అధికమయ్యాయన్నారు. 2022లో వచ్చిన గోదావరి వరదలకు పోలవరం నిర్వాసిత నాలుగు మండలాల ప్రజలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుండి వాళ్ళ మొబైల్‌తో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 9261292612కు మిస్డ్ కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నాయకులు బురక కన్నారావు, బొర్రా నరేష్ కుమార్, బీరకా సూర్య ప్రకాష్‌రావు, ముత్యాల రాంబాబు, ముత్యాల సిద్దు, ముత్యాల చంద్రశేఖర్, ముత్యాల రమేష్, ఆసు చంద్రయ్య, సోడి దారయోగి, సోడి కన్నయ్య, సోడి దూలయ్య, పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు

రజక వృత్తిదారులకు రాయితీ రుణాలివ్వాలి

ఎపి రజక వత్తిదారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి కంచరపాలెం : రజక వృత్తిదారులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మాధవధార, మురళీనగర్ వాటర్ ట్యాంక్ వద్ద బి.రాజారావు అధ్యక్షతన సంఘ సభ్యుల సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ రజకుల నివాసానికి ఇళ్లు లేని పరిస్థితుల్లో అపార్ట్‌మెంట్ల వాచ్‌మెన్లగాను, ఇంటిపనివాళ్లుగా జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులకు వృత్తి పరికరాలతోపాటు రాయితీ రుణాలను ఇవ్వాలని కోరారు. వత్తి స్థలాలు, సంచార లాండ్రీలక జగనన్న చేదోడు పథకం కింద ఆర్థియసాయం అందించాలని కోరారు సభలు, సమావేశాలపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ1 రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.గోవిందరావు, బి రాజు, టి తిరుపతిరావు, పి అచ్యుతరావు, ఎ.సింహాద్రి, టి రాము, బి ధనుంజయ్ పాల్గొన్నారు

మరోసారి నమ్మి మోసపోవద్దు!

ప్రజాశక్తి- గాజువాక : ఒక్క ఛాన్స్ అంటే నమ్మి అధికారం ఇచ్చినందుకు రాష్ట్రానికి, ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని, మరోసారి అవకాశమిచ్చే పరిస్థితుల్లో ప్రజలు లేరని విశాఖపార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి, జగన్‌కు దిమ్మదిరిగే గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. బుధవారం టిడిపి ఆధ్వర్యంలో 75వ వార్డు, పెదగంట్యాడ, ఎస్‌సి కాలనీల్లో ౧ ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల ప్రజలు పడుతున్న కష్టాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేవడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలోటిడిపి నేతలు పెద్దాడ సోము నాయుడు నామాల పెంటయ్య అప్పారావు, వెళ్ళంకి రమణ, అప్పల రెడ్డి, అప్పారావు, ఉరుకుటి సుభాషిణి పాల్గొన్నారు

వివేకానందుని స్ఫూర్తితో సామాజిక సేవ

ప్రజాశక్తి -ములగాడ: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని 61వ వార్డుకు చెందిన సామాజిక సేవా కార్యకర్త, నేవల్ డాక్‌యార్డు కాంట్రాక్టు కార్మికుడు కాకి సంతోష్‌కుమార్ బుధవారం వన్‌టౌన్‌లోని వివేకానందుడి విగ్రహాన్ని శు భ్రపరిచి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుని స్ఫూర్తిగా తీసుకుని తనకు వచ్చే వేతనంలో 30 శాతం మొత్తాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు సంతోష్‌కుమార్ వెల్లడించారు.

అపోలోలో అరుదైన శస్త్రచికిత్స

(**పజాశక్తి - ఆరిలోవ :** ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో ఆసుపత్రిలో అంగ వైకల్య ఎముకలను సవరించే అరుదైన, సున్నితమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. బుధవారం అపోలో ఆసుపత్రిలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, హెచ్ఒడి డాక్టర్ అబ్దుల్.డి.ఖాన్ విలేకర్లతో మాట్లాడుతూ, నగరానికి చెందిన 52 ఏళ్ళ మహిళ డయాబెటిక్ కారణంగా ఎడమ పాదం అన్ని వేళ్ళు వంకరబోయి అంగవైకల్యంతో అపోలో ఆసుపత్రిని వచ్చిందన్నారు. రోగిని పరీక్షించిన డాక్టర్ అబ్దుల్ డి ఖాన్, ఎంఆర్ఐ స్కాన్‌లో అన్ని వేళ్ల వంకరపోవడంతోపాటు చిటికెన వేలికి ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు నిర్ధారించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగి స్టెయిన్స్ బై, హాన్సన్ విధానం ద్వారా వేళ్లను సరిచేయడంతో పాటు ఇన్‌ఫెక్షన్‌ను తొలగించారు. రోగి ఒక్క రోజులోనే డిస్చార్జ్ చేసినట్టు తెలిపారు. రోగి, ఆమె కుటుంబ సభ్యులు డాక్టర్ డి ఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగి యువకుడు ఆత్మహత్య



వంశీకృష్ణ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కుంజం వంశీకృష్ణ (22) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం ప్రకారం... వంశీకృష్ణ ఏజీబీఎస్సీ చదువుకొని ఖాళీగా ఉంటున్నాడు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలని, ఏదో ఒక ఉద్యోగం సంపాధించుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై, క్షానికావేశంలో మంగళవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి రాత్రే మృతి చెందాడు. రాజవొమ్మంగి ఎస్ఐ టీజీ నరేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.